సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు రూ.12.46లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబర్‌పేట నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీనిచ్చారు. పేదలు మెరుగైన వైద్య సేవలు పొందడానికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


ఓయూ ప్రొఫెసర్ రామకృష్ణను సన్మానిస్తున్న అధ్యాపకులు

విద్యారంగంలో నూతన పరిశోధనలు జరగాలి

● ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రామకృష్ణ

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు జరగాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రామకృష్ణ ఆకాంక్షించారు. బాగ్‌లింగంపల్లిలోని డా.బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నగరంలోని పలు విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులకు ఫ్యాకల్టీ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన పరిశోధనలు ఎక్కువగా జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలో అనేక మార్పులు చేయాలని సూచించారు. ఓయూ ప్రొఫెసర్ చక్రవర్తి, డాక్టర్ జాకోబ్ కల్లె, రిటైర్డ్ ప్రొఫెసర్ చెన్న బసవయ్య, డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుప్రియ, డైరెక్టర్ యాదగిరి, ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ రమణ, అశోక్‌గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యపురాశి, ఎంపలి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కాశీం, డా.శ్రీనివాస్ తదితరులు

యువతరం కవిత్వంలో రాణించడం హర్షణీయం

● పలువురు వక్తలు

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కొత్తతరం రాస్తున్న కవిత్వానికి కవిలేఖలు ఒక నూతన ఒరవడి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తగుళ్ల గోపాల్ కవి లేఖలు ధాన్యపురాశి, నాగిళ్ల రమేష్ కవి లేఖలు ఎంపలి పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కాశీం, రచయిత డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్‌లు హాజరై పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. యువతరం కవిత్వంలో రాణించడం గొప్ప విషయమని, అందుకు ఈ రెండు పుస్తకాలు ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. ధాన్యపురాశి పుస్తకాన్ని డాక్టర్ మల్లేగోడ గంగాప్రసాద్, ఎంపలి పుస్తకాన్ని దిలీప్‌లు పరిచయం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వీరంచి, మహేష్, ఆశారాజు, మోహన్‌కృష్ణ, రాజారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

● సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి పిలుపునిచ్చారు. చిక్కడపల్లిలోని సూర్యనగర్ సీపీఐ కార్యాలయంలో జరిగిన ముషీరాబాద్ నియోజకవర్గం సీపీఐ 4వ మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముషీరాబాద్‌లో సీపీఐ బలోపేతం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. పది గంటల పనిదినాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి యాదగిరి, ముషీరాబాద్ నాయకులు శ్రీమాన్, కుమారస్వామి, వాసీమ్, రజిత, బాబర్, మంజుల, సుజాత, మహేశ్, కట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి : శివకుమార్

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఇంటలిజెన్స్ ఓఎస్‌డీ శివకుమార్ సూచించారు. కాచిగూడ వైశ్య హస్టల్ ఆడిటోరియంలో వైశ్య హస్టల్ ట్రస్ట్ బోర్డు, వైశ్య హస్టల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు శనివారం స్కాలర్‌షిప్స్, స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. వైశ్యహస్టల్ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కొత్తూరు జయప్రకాష్ రామ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, కోశాధికారి మధు, వైశ్య హస్టల్ అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రవి, ప్రసన్నకుమార్, కోశాధికారి రాజేశ్వరరావు, ఈఏపీ ఛైర్మన్ జయరాములుగుప్తా, కో ఛైర్మన్ దయాకర్‌గుప్తా పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి: కార్పొరేటర్

నల్లకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకటరెడ్డిలు ప్రజలకు సూచించారు. జీహెచ్ఎంసీ చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ పార్కులో వారు మొక్కలు నాటి మాట్లాడారు. చెట్లను నరికివేయడం వల్ల కాలుష్యం పెరిగిపోయి ప్రజలు అనేక రోగాల బారినపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ చెట్లు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ జనరల్ సెక్రటరీ వెంకటరావు, నాయకులు వెంకటరమణ, గోవింద్ అర్జున్, సంజీవ్ చౌదరి, ఆర్పీఐ రమేశ్, రాంనరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించండి: సంతోష్‌కుమార్

కవాడిగూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలని, అందుకు రవాణా శాఖాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ధర్మసమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంతోష్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమోహన్‌యాదవ్‌కు శనివారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు యాజమాన్యాలు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కిరణ్, శివగౌడ్, శ్రీధర్, రాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం

కవాడిగూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డీబీఆర్‌మిల్ వద్ద ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో కల్యాణ వేడుకలను శనివారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఒగ్గుపూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెన్ శ్రీనివాస్‌రావును ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఎల్లమ్మ కల్యాణం అనంతరం కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బీసీల పక్షపాతి కాంగ్రెస్

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజిక విప్లవానికి నాంది అని ఆయన పేర్కొన్నారు. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, టీపీపీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కనీస వేతన సలహ మండలి మాజీ ఛైర్మన్ నాగభూషణంలు శనివారం మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

> బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్ పార్టీ విజయమని పలువురు నేతలు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం కల్పిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

రాంనగర్/చిక్కడపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటంనేని వెంకటేష్‌గౌడ్, పార్టీ సికింద్రాబాద్ జిల్లా సెక్రటరీ జనరల్ యాదగిరిగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నరసయ్య అన్నారు. గాంధీనగర్‌లో శనివారం సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ టీజేఎస్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, వెంకటయ్య, అజయ్‌గౌడ్, సుధాకర్, సత్యనారాయణ, రాజు, శ్రీకాంత్, బస్తీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట: దేశంలోనే మొట్టమొదటి సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని టీపీసీసీ కార్యదర్శి అజయ్‌కుమార్, టీపీసీసీ ఓబీసీ సెల్ అడ్వయిజర్ శ్రీధర్‌రావు, టీపీసీసీ ఓబీసీ వైస్ ఛైర్మన్ సుభాష్‌లు కొనియాడారు. హైదర్‌గూడలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు.

బీసీ ఫెడరేషన్ నేతల హర్షం..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల తెలంగాణ బీసీ ఫెడరేషన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. హైదర్‌గూడలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు, ఉపాధ్యక్షుడు సోమవంశీ, క్షత్రియ సంఘం రాష్ట్ర నాయకులు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి యుగంధర్, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ వీరప్ప, కోశాధికారి కరుణాకర్‌లు శనివారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా బీసీలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ నాయకులు జాజెరావు, వేదాకర్ తదితరులు పాల్గొన్నారు.


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాగభూషణం తదితరులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

- ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి
- సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి
- ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్

కవాడిగూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి.. దాని స్థానంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పలువురు రాజకీయ పార్టీ నేతలు, వివిధ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహాధర్నాకు ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా తన గొంతు వినిపిస్తానన్నారు. ఈటల మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేయకపోతే ప్రభుత్వాలు స్తంభించిపోయే పరిస్థితులు ఉన్నాయని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో మార్పు రావాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికలలోపే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని రాకేష్‌రెడ్డి చెప్పారు.


ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఎంపీలు ఆర్. కృష్ణయ్య, ఈటల రాజేందర్ తదితరులు

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● అమరుడు శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని అమరుడు శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ డిమాండ్ చేశారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉద్యమకారుల జేఏసీ ఛైర్మన్‌గా సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా సోమన్న, క్రిష్టోఫర్, ఉపాధ్యక్షులుగా రషీద్, స్వరూప, యాదయ్య, కార్యదర్శులుగా మోత్కురి మల్లేష్, అంబాల రామారావు, కళాకారుల విభాగం అధ్యక్షుడిగా డోలక్ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఫక్రుద్దీన్, జర్నలిస్టు విభాగం అధ్యక్షుడిగా రాజు, ఆర్టీసీ విభాగం నాయకులుగా జానకి, విద్యార్థి విభాగం నాయకులు శిరీషతోపాటు 50 మంది కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శంకరమ్మ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జేఏసీ ఛైర్మన్ సుల్తాన్‌యాదగిరి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉద్యమకారుల డిమాండ్ల కోసం పోరాటం చేయడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ నూతన ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పెన్షన్ ఇవ్వాలన్నారు. ఉచిత వైద్యం, ప్రయాణ సౌకర్యం కల్పించాలని, వెయ్యి కోట్లతో ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


ఉద్యమకారుల జేఏసీ నూతన కమిటీ సభ్యులతో శంకరమ్మ

'డీఈఈసెట్‌లో ఈడబ్ల్యూఎస్‌ను అమలు చేయాలి'

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలోని డీఈఈసెట్ అడ్మిషన్స్‌లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర శ్రీవైష్ణవ సేవా సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరువరంగం ప్రభాకర్, పీచర కృష్ణమాచార్యులు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. డీఈడీ సీట్ల భర్తీలో అగ్రవర్ణ పేదలకు అన్యాయం జరుగుతోందని, ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలయ్యేలా చూడాలని వారు కోరారు.

యుద్ధప్రాతిపదికన రహదారి నిర్మాణ పనులు

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కాచిగూడ డివిజన్‌లో రహదారుల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేస్తున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. నింబోలిఅడ్డలోని రహదారి మరమ్మతు పనులను ఆమె శనివారం పరిశీలించి మాట్లాడారు. అన్ని ప్రాంతాలలో ఈ రహదారుల మరమ్మతు పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, ఎస్ఏ ఆశాలత, నాయకులు ప్రభాకర్, మల్లికార్జున్, సంతోష్, రవియాదవ్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల కొవ్వొత్తుల ర్యాలీ

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేయడాన్ని నిరుద్యోగులు వ్యతిరేకించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే ఉద్యోగం రాదేమోనన్న బాధ, ఆర్థిక ఇబ్బందులతో నల్గొండలో అఖిల్, సిరిసిల్లలో శ్రీకాంత్‌లు చనిపోయారని నిరుద్యోగులు ఆరోపించారు. శనివారం రాత్రి చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ వద్ద నిరుద్యోగులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అఖిల్, శ్రీకాంత్‌లకు నివాళులర్పించారు. ప్రభుత్వం వారి కుటుంబసభ్యులను ఆదుకుని కోటి రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్, కిరణ్, లక్ష్మీకాంత్, వెంకటేష్, సంపత్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆలయాల జీర్ణోద్ధరణకు టీటీడీ తోడ్పాటునివ్వాలి'

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తోడ్పాటునివ్వాలని అఖిల భారత పురాతన ఆలయాల పునరుద్ధరణ ట్రస్ట్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ట్రస్ట్ ఛైర్మన్ ఆర్‌కే జైన్, ట్రస్టీలు జస్మత్‌పటేల్, రితీషా జాగీర్దార్, ఉమేష్‌శర్మ, వెంకటేశ్‌గుప్తలు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీరామచంద్ర ఆశ్రమం కన్హా శంషాబాద్ అధ్యక్షుడు కమలేష్‌పటేల్, శ్రీలంకలో 2 దేవాలయాల పునరుద్ధరణ, మొయినాబాద్‌లోని బాలాజీ ఆలయ పునర్‌నిర్మాణం గురించి టీటీడీ ఛైర్మన్‌కు సమాచారం అందించారు. టీటీడీ తరపున ఆలయాల జీర్ణోద్ధరణకు పూర్తి సహకారం అందిస్తామని బీఆర్‌నాయుడు హామీనిచ్చినట్టు వారు తెలిపారు.

నాట్య గురువులకు సన్మానం

చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని బీఆర్ఎస్ పార్టీ సీనియర్‌నేత, సంఘసేవకులు నాగేశ్‌ముదిరాజ్ అన్నారు. గురు పూర్ణిమ సందర్భంగా త్యాగరాయ గానసభలో శనివారం బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్య గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగేశ్ నాట్యగురువులను సన్మానించారు. ఏ రంగంలోనైనా గురువులకు మంచి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. సమాజాన్ని మంచి మార్గంలో నడిపించడంలో గురువులదే కీలకపాత్ర అని నాగేశ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కథక్ నాట్య గురువు పండిట్ అంజిబాబు, పూర్వ జడ్జి బూర్గుల మధుసూదన్, నిర్వాహకులు విక్కీమాస్టర్, సంఘసేవకులు వసంతరాయలు, టీడీపీ నేతలు సాయిబాబా, బాలరాజుగౌడ్, కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

ముషీరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు చెట్ల కొమ్మలను శనివారం తొలగించారు. ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్రకాలనీ, పార్శిగుట్ట, ఎంసీహెచ్ కాలనీ, జాంబవినగర్, బాపూజీనగర్ ప్రాంతాలలోని అమ్మవారి ఆలయాల వద్ద ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను అధికారులు తొలగించారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలించారు.

బీఆర్ఎస్ కంచుకోట ముషీరాబాద్

చిక్కడపల్లి/ రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కంచుకోట అని ఆ పార్టీ రాష్ట్ర యువజన నేత ముఠా జైసింహ అన్నారు. బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్, అడిక్‌మెట్ డివిజన్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానిన వేర్వేరుగా శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గత రెండు పర్యాయాలు ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌కు అఖండ విజయాన్ని అందించారని, మూడో సారి కూడా బీఆర్ఎస్‌కు విజయాన్ని అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, అడిక్‌మెట్ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గుప్తా, ప్రధానకార్యదర్శి సురేందర్, పార్టీ నేతలు నరేశ్, సత్యనారాయణ, రవి, శ్రీకాంత్, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, వెంకటేష్, దేవయ్య, గౌస్ భాయ్, జహంగీర్, విఠల్, ఎస్టీ ప్రేమ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, యాదగిరి, కుమారస్వామి, గురుదీప్‌సింగ్, రామస్వామి, శ్రీనివాస్, యూనీస్, అబ్బు, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ అంకితభావంతో పనిచేస్తున్నదని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. అవసరమైతే ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్‌లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఇన్‌చార్జి దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు అలీ, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, శ్రీనివాస్, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, గోవింద్‌రాజ్, అజీజ్‌పాషా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముఠా జైసింహ

'రేషన్ కార్డుల కోసం దళారులను ఆశ్రయించొద్దు'

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల కోసం ఎవరు దళారులను నమ్మి మోసపోవద్దని, అర్హులందరికీ కార్డులు వస్తాయని పౌరసరఫరాల శాఖ సర్కిల్ 6 ఏఎస్‌వో దీప్తి తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతితో ఆమె మాట్లాడారు. సర్కిల్ 6 పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో నివాసం ఉండే అర్హులందరూ కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న వాటిని తమ సిబ్బంది విచారించి అర్హత కలిగిన వారిని గుర్తించి కార్డు పొందేందుకు సీఆర్‌వోకు ప్రతిపాదనలు పంపిస్తారని తెలిపారు. రేషన్ కార్డుల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆమె సూచించారు. కొత్త కార్డుల దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా జరుగుతుందని ఆమె చెప్పారు. కొత్త రేషన్ కార్డు, పేర్ల నమోదు, తొలగింపు వంటి అంశాలకు సంబంధించి ఎవైనా అనుమానాలు ఉంటే బాగ్‌లింగంపల్లిలోని ఏఎస్‌వో కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవాలని ఏఎస్‌వో ప్రజలకు సూచించారు.

కల్తీ కల్లు నివారణకు చర్యలు

● ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ

ముషీరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్తీ కల్లు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 10 కల్లు కంపౌండ్‌లలో సీఐ ఆకస్మిక తనిఖీలు చేసి కల్లు శాంపిల్స్‌ను సేకరించారు. అనంతరం సీఐ రామకృష్ణ మాట్లాడుతూ, కల్లు కంపౌండ్‌ల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను నారాయణగూడలోని ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. ప్రకృతి నుంచి వచ్చే చెట్ల కల్లునే విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. రసాయనాలను కలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు. కల్తీ కల్లు విక్రయించే కంపౌండ్‌ను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా తమకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు రామకృష్ణ సూచించారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్లు కంపౌండ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


కల్లు శాంపిల్స్‌ను సేకరిస్తున్న ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు

బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర

● ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం



మాట్లాడుతున్న వెంకటాచలం

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి వెంకటాచలం ఆరోపించారు. వ్యవస్థల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం యూనియన్‌లు, ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో కోటక్ మహేంద్ర బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ 31వ జాతీయ మహాసభలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాన్యులకు సేవలందించేందుకు ఆనాటి ప్రభుత్వం బ్యాంకులను జాతీయాకరణ చేసిందని, నేటి పాలకులు వాటిని ప్రజలకు దూరం చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులు ఉద్యోగుల శ్రమను మరింత దోపిడీ చేయడానికి పది గంటల పని విధానాన్ని తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అనేక పోరాటాలతో సాధించుకున్న 8 గంటల పని విధానం స్థానంలో 10 గంటల పని విధానం తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ శక్తులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని వెంకటాచలం పిలుపునిచ్చారు. ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల జాతీయాకరణను వ్యతిరేకించిన వారే ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తుండడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కనీసం నిరసన తెలిపే హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు కేఎంబీఈయూ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షత వహించగా కోటక్ మహేంద్ర బ్యాంక్ సీహెచ్‌ఆర్‌వో అనుపమ్‌కౌర, కేపీబీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి జయంత్ నాయకులు ఫణింద్ర, సుజిత్‌రాజ్, జితేంద్ర ప్రసాద్‌షా, వెంకటేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● డా. పార్వతి

నల్లకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రమాబాయి మాలల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డా.రెడ్డిమల్ల పార్వతి విద్యార్థులకు సూచించారు. నల్లకుంట డివిజన్‌లోని నర్సింహబస్తీలో పేద విద్యార్థులకు లాంగ్‌బుక్స్‌ను ఆమె శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. నగరంలోని మురికివాడలలో నివసిస్తున్న పేద విద్యార్థులకు రమాబాయి మాలల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా లాంగ్ బుక్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేద పిల్లలు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని, తద్వారా వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.


విద్యార్థులతో డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి